క్లుప్తంగా

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన



తిరువూరు: నందిగామలో న్యాయవాదిపై దాడి ఘటనను నిరసిస్తూ తిరువూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం కోర్టు విధులు బహిష్కరించారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని, నందిగామలో న్యాయవాదిపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ చైర్మన్ వాకదాని లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. కొద్దిసేపు కోర్టు ఎదుట నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి గౌసుద్దీన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

చాట్రాయి: మండలంలోని సోమవరం పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని అన్ని వీధుల్లో బ్లీచింగ్ చల్లి డ్రెయినేజీల్లో పూడిక తీశారు. సర్పంచ్ ఉప్పాల శోభన్‌బాబు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ్‌కుమార్‌కు నివాళి



గంపలగూడెం: గంపలగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మేచినేని ప్రేమ్‌కుమార్ (47) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు సందర్శించి నివాళులర్పించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు పలువురు ప్రేమ్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



తిరువూరు: వికసిత్ ఆంధ్రప్రదేశ్ 2047 అంశంపై స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు గురువారం మండల స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంఈఓ రామకృష్ణ మాట్లాడుతూ వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యాలను వివరించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన షమీనా, మేఘనారెడ్డి, మౌనికలకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం పీఎస్ఎన్ రాజు, ఉపాధ్యాయుడు రాంప్రదీప్, సీఆర్పీలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత



ఆగిరిపల్లి: దివ్యాంగులకు వైకల్యం ఆటంకం కాకుండా కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సినీ హీరో ఆర్యన్ గౌరా అన్నారు. తోటపల్లి హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో సంఘ సేవకులు బోగారెడ్డి ప్రియాంక, అమెరికాకు చెందిన డాక్టర్ నాగబిందుశ్రీ, మై సాథియా సినిమాలో హీరోగా నటించిన ఆర్యన్ గౌరా ఆర్థిక సాయంతో ఐదుగురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేశారు. కార్యక్రమంలో హీల్ సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్, ప్రొఫెసర్ పీఎల్ఎన్ రాజు, వల్లూరి రాజ్యలక్ష్మి, సుగుణ, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

యోగా పోటీలకు ఎంపిక



వీరులపాడు: ఈనెల 14వ తేదీ నుంచి భీమిలిలో జరుగనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పొన్నవరం ఏకత్వ పాఠశాల హెచ్ఎం అడపా నాగసూర్యవతి తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులు ప్రతిపాటి వెంకట లోహిత్, కనకపూడి అభిషేక్, తాళ్ల లోహితాశ్వ, సురవరపు సుమంత్ రెడ్డిలను గురువారం పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అమరనేని మనోజ్, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, గోగులమూడి మనోజ్, అమరనేని సింధూర, ఐశ్వర్య సాంబశివన్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో ఉద్యాన పంటల రక్షణ

- ఇబ్రహీంపట్నం మండలం, లంక భూముల్లో 370 ఎకరాల్లో సాగు
- భారీ వర్షాలు, వరదలకు ముంపు బారిన 260 ఎకరాలు
- పంటల రక్షణకు ఉద్యాన శాఖాధికారి సూచనలు



నీలిమ, ఉద్యాన శాఖాధికారి, ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం: అధిక వర్షాలు, వరదకు ఉద్యాన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండల పరిధిలోని గ్రామాలు, లంక భూముల్లో ఈ ఏడాది సుమారు 370 ఎకరాల్లో రైతులు ఉద్యాన పంటలుగా కంద, పసుపు, మునగ, అరటి, నిమ్మ, బొప్పాయి, మామిడి, ఆయిల్‌పామ్, మిరప, కూరగాయలు, ఆకుకూరల పంటలు సాగు చేశారు. సుమారు 260 ఎకరాల వరకు ముంపు బారిన పడటంతో తెగుళ్ల ఆశించి సూక్ష్మధాతు లోపం ఎక్కువగా కనిపిస్తోంది. రైతు లు సస్యరక్షణ చర్యలు చేపట్టి దిగుబడులు తగ్గకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఇబ్రహీంపట్నం ఉద్యాన శాఖాధికారి నీలిమ పలు సూచనలు చేశారు.

తీసుకోవల్సిన జాగ్రత్తలు..

నారుమళ్లు, పంటల్లో నిల్వ ఉన్న అదనపు నీటిని బయటకు పంపించి వేయాలి. కుళ్లు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలి. తేమ అధికంగా ఉన్న పొలాల్లో సూక్ష్మ పోషకాల మిశ్రమం 2.5 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేట్ 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి చల్లాలి. ఇనుపధాతు లోపం గమనిస్తే అన్నభేది 2.5 గ్రాములు, నిమ్మ ఉప్పు 0.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పంటలతో పాటు నారుమళ్లలో వ్యాధికారక శిలీంద్రాలు, చీడపీడల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి.



జూపూడి లంకలో వరద నీరు పట్టిన పసుపు పంట



మూలపాడులో వరద, ఈదురు గాలులకు ఒరిగిన అరటి తోట

అరటిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు: గాలికి ఒరిగిన అరటి తోటలో అరటి గెలలను కోసి మార్కెట్ చేసుకోవాలి. 5 నుంచి 7 నెలల వయస్సు లేత అరటి తోటలు విరిగితే తోటలను శుభ్రం చేసి కొత్త పిలకలను వదులుకోవాలి. పిలకలకు ప్రతి 25 రోజులకు ఒకసారి మొక్కకు 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. రెండు, మూడు నెలల వయస్సు ఉన్న అరటి మొక్కలు విరిగిపోతే విరిగిన చోట కోసి వేసి మరలా ఆ మొక్కలు పెంచవచ్చు. అరటి దుంపలు కుళ్లిపోకుండా కాఫర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి దుంప చుట్టూ కలిసేలా నేలలో పోయాలి.

పసుపు పంటలో జాగ్రత్తలు: పంటలో చేరిన అదనపు వర్షం, వరద నీటిని ముందుగా బయటకు పంపాలి. పంటపై లీటరు నీటికి 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపిన ద్రావణం వారం రోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు చల్లుకోవాలి. పంటలో ఇనుపధాతు లోపంతో లేతాకులు పాలిపోయినట్లు కనిపిస్తే 10 లీటర్ల నీటిలో 50 గ్రాముల చొప్పున అన్నభేది, నిమ్మరసం, జిగురు మందుతో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. నేల అదునుకు వచ్చిన వెంటనే అంతర కృషి చేస్తే త్వరగా ఆరుతుంది. ఎకరాకు 50 కిలోల యూరియా, 40 కిలోల పొటాషియం, 200 కిలోల వేపపిండి వేయాలి.

కూరగాయ పంటలు: ముంపునకు గురై కాపుతో ఉండి వాలిపోయిన మొక్కలను నిలబెట్టి మొదలు చుట్టూ మట్టి పోయాలి. మొక్కలు తేరుకున్న తర్వాత స్థూల పోషకాల మిశ్రమం (19-19-19), 5 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ 5 గ్రాములు, సూక్ష్మపోషకాల మిశ్రమం 2.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి విడివిడిగా వారంరోజుల వ్యవధిలో రెండు, మూడు సార్లు చల్లాలి. పంటకు ఆకుమచ్చ, కాయకుళ్లు, బూజు తెగుళ్లు ఉంటే ముందు జాగ్రత్తగా లీటరు నీటికి 2.5 గ్రాముల మాంకోజెబ్, కార్బెండిజమ్ మందు ద్రావణం చల్లుకోవాలి. వేరుకుళ్లు ఆశించకుండా పంటలో పది లీటర్ల నీటిలో 30 గ్రాముల కాఫర్ ఆక్సీక్లోరైడ్ కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోసుకోవాలి.

ముంపు పొలాలను పరిశీలించిన ఆర్డీఓ

ఆగిరిపల్లి: మండలంలోని తోటపల్లిలో భారీ వర్షాలతో నీటి మునిగిన వరి పంటలను ఆర్డీఓ భవానీ శంకరి గురువారం పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అనంతరం ఆగిరిపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ ప్రసాద్, డెప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

త్వరితగతిన పరిహారం అందించాలి



జి.కొండూరు: వరద ముంపునకు గురై నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం వెంటనే అందించాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. కవులూరు గ్రామంలో వరద ముంపునకు గురై కుళ్లిపోయిన వరి, పత్తి పైర్లను, బుడమేరు డైవర్షన్ కెనాల్‌కు పడిన గండ్లను గురువారం ఆమె పరిశీలించి మాట్లాడారు. గండ్లు పడిన ప్రదేశాలలో మేటలు వేసిన పొలాలకు అదనపు సాయం అందించాలని కోరారు. సర్పంచ్ కొండా మరియమ్మ, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ చెరుకూరి సాంబశివరావు, వైస్ సర్పంచ్ బొర్రా నరేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాల నివారణే లక్ష్యం

సీడీపీఓ ఎస్వై నూరానీ

నూజివీడు: మాతా శిశు మరణాల నివారణే లక్ష్యమని ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్వై నూరానీ అన్నారు. పోషణ మాసోత్సవంలో భాగంగా పట్టణంలోని బాపూనగర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం ద్వారా మాతా, శిశు మరణాలను అరికట్టడమే కాకుండా ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనివ్వొచ్చని చెప్పారు. కిశోర బాలికల దశ నుంచే పోషకాహారం వల్ల కలిగే లాభాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గర్భిణులకు పోషకాహారాన్ని అందించడం వల్ల ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిస్తారన్నారు. తక్కువ ఖర్చులో లభించే ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు తీసుకోవడం ద్వారా సమతులాహారం అంది ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలంటే వారికి పోషకాహారాన్ని అందివ్వాలన్నారు. అనంతరం కిశోర బాలికలకు, గర్భిణులకు హెచ్‌బీ నిర్ధారణ పరీక్షలు చేశారు. కిశోర బాలికలకు పౌష్టికాహారంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సూపర్‌వైజర్ ధనలక్ష్మి, హెచ్‌వీ కుమారి, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



నూజివీడు బాపూనగర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరి

ఎన్టీఆర్‌కాలనీ(గంపలగూడెం): నిర్ణీత వయస్సు వచ్చే వరకు చిన్నారులు తగిన బరువు తప్పకుండా ఉండేలా పౌష్టికాహారం అందజేయాలని ఐసీడీఎస్ గంపలగూడెం సెక్టార్ సూపర్ వైజర్ మునిలక్ష్మి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గంపలగూడెం ఎన్టీఆర్ కాలనీలో 65వ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లులు, గర్భిణులకు పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

- **చాట్రాయి:** గర్భిణులు చిరు ధాన్యాలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీ దేవి అన్నారు. గురువారం మండలంలోని చిత్తపూరు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జీతాల కోసం నిరసన ప్రదర్శన

నూజివీడు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వం వెంటనే జీతాలు విడుదల చేయాలని సీఐటీయూ నూజివీడు ప్రధాన కార్యదర్శి జి. రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో శానిటేషన్ సిబ్బందితో కలిసి గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదు నెలలుగా పాఠశాలల పారిశుద్ధ్య సిబ్బందికి వేతనాలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా జాప్యం చేయడం వల్ల నిత్యావసర వస్తువులు, కూరగాయలు కొనగోలు చేయడానికి కూడా వారు అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. కార్మికులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ పక్కాగా జరగాలి

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

జి.కొండూరు: వరద బాధిత ప్రతి కుటుంబానికి ప్రభుత్వ నిత్యావసరాలు సక్రమంగా అందేలా చూడాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. జి.కొండూరు కమ్యూనిటీ హాల్‌లో నిత్యావసరాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. బాధితులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

- **రెడ్డిగూడెం(మైలవరం):** వరద బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. రెడ్డిగూడెం మండలంలో ఎంపీ కేశినేని శివనాథ్‌తో కలిసి ఎమ్మెల్యే వరద బాధిత కుటుంబాలకు గురువారం నిత్యావసర సరకులు పంపిణీ చేసి మాట్లాడారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.



జి.కొండూరులో వరద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత

విజేతలకు బహుమతుల పంపిణీ



తునికిపాడు(గంపలగూడెం): జాతీయ హిందీ దినోత్సవం సందర్భంగా గంపలగూడెం మండలం తునికిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం హిందీ ఉపాధ్యాయులు వనం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు హెచ్ఎం పీవీఎస్ఏ శర్మ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపదలో ఆపన్నహస్తం

మైలవరం: మైలవరంలోని చంద్రబాబు నగర్, బైపాస్ రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న 100 నిరుపేద కుటుంబాల వారికి గురువారం స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఎయిర్ కామ్ రిఫ్రిజిరేషన్ విజయవాడ బ్రాంచ్ మేనేజర్ ఎస్. పద్మావతి సౌజన్యంతో 100 టీషర్ట్స్ పంపిణీ చేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి. శివహరిప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఆఫీసర్ ఎల్.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

- **కె.తాడేపల్లి(విజయవాడరూరల్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా ఉద్యోగులు గురువారం కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని వరద బాధిత 170 కుటుంబాలకు నెలవారీ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంఘం నాయకులు, విజయవాడ రూరల్ తహసీల్దార్ బి.సుగుణ పాల్గొన్నారు.



కొత్తూరు తాడేపల్లిలో వరద బాధితులకు సహాయం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు



మైలవరం జంగాల కాలనీలో దుప్పట్లు, టీ షర్ట్స్ అందజేస్తున్న అధ్యాపకులు

నష్టపోయిన రైతుల జాబితా ప్రదర్శన

తిరువూరు: ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా తిరువూరు మండలంలో ఖరీఫ్ పంటలు కోల్పోయిన రైతుల జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో గురువారం ప్రదర్శించారు. సామాజిక తనిఖీ నిమిత్తం ఈ జాబితాలను అందుబాటులో ఉంచామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 16 వ తేదీలోగా రాతపూర్వకంగా రైతు సేవా కేంద్రాల్లో అందజేయాలని మండల వ్యవసాయాధికారి పద్మ సూచించారు. తుది జాబితా ఈనెల 16న ప్రదర్శిస్తామని చెప్పారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్



విస్సన్నపేట: విస్సన్నపేట, ఎ. కొండూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు నేరాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను విస్సన్నపేట పోలీసులు గురువారం అరెస్టు చేసి తిరువూరు సీఐ గిరిబాబు సమక్షంలో కోర్టుకు హాజరుపరిచారు. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కంభంపాడుకు చెందిన ఎస్‌కే సుభానీ (మస్తాన్), పాత తిరువూరుకు చెందిన ఎస్‌కే హర్షద్, విస్సన్నపేటకు చెందిన ఎస్‌కే సుభానీని అరెస్టు చేసి వారి నుంచి రూ.1,80,000 విలువైన ఒక బైక్, ఆరు మేకలు, ఆరు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు



విస్సన్నపేట ఇందిరా నగర్‌లో నిమజ్జనానికి తరలుతున్న ప్రతిమ




నూజివీడులో వినాయకుడిని దర్శించుకుంటున్న ప్రతాప్ అప్పారావు



తిరువూరు రాజుపేట పాత ఏడీబీలో గణపతికి దీపాలంకరణ సేవ



నూజివీడులో పూజలు



గంపలగూడెంలో వినాయకుడి ప్రతిమ



ఊటుకూరు బొడ్డురాయి సెంటర్‌లో గణనాథుడు

వినాయక నవరాత్రి ఉత్సవాలు గురువారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఆయా గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన పందిళ్ల వద్ద వివిధ రూపాల్లో ఉన్న గణనాథునికి విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. గంపలగూడెం గాంధీ సెంటర్‌లో విగ్రహం వద్ద మహిళలు వినాయక గానామృతం నిర్వహించారు. నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మునసి రామమందిరం వద్ద, పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కొండూరు శివప్రసాదరెడ్డి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని దర్శించుకుని పూజలు చేశారు.

-గంపలగూడెం/ తిరువూరు/ నూజివీడు/విస్సన్నపేట

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు



విస్సన్నపేట: ప్రభుత్వం జీఓ నెంబర్ 117ను ఉపసంహరించు కోవాలని, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3,4,5 తరగతుల విద్యార్థులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు పంపి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బీసీహెచ్‌వీ సూర్యనారాయణ అన్నారు. మండలంలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు ఉపాధ్యాయులకు సభ్యత్వాలు ఇచ్చారు. యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి. రామకృష్ణారెడ్డి, మండల నాయకులు వి. వెంకటేశ్వరరావు, సీహెచ్ చంటి పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి సీపీఎం నివాళి

ఇబ్రహీంపట్నం: సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ మాజీ సభ్యుడు సీతారాం ఏచూరి మృతి తీరని లోటని సీపీఎం నాయకులు అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ నాయకులు మహేష్, ఆలేటి విఠల్ రావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి కార్మికులు, కర్షకులు, నిరుపేదల కోసం తుది శ్వాస వరకు పోరాడారని కొనియాడారు. కొండపల్లి శాంతినగర్ ఇందిరమ్మ కాలనీలో ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు నివాళులర్పించారు. విఠల్ రావు, బాషా, కాంతారావు, రామసీత తదితరులు పాల్గొన్నారు.

- **మైలవరం:** సీతారాం ఏచూరి మృతికి మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కోయ సుధ గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన సేవలను కొనియాడుతూ నివాళులర్పించారు.
- **తిరువూరు:** స్థానిక సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేకల నాగేంద్ర ప్రసాద్, నాయకులు వెంకటరత్నం, ఎస్‌వీ భద్రం, ఆకుల రవి, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ మండల స్థాయి పోటీలు



నూజివీడు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలకు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం ఉదయం 10 గంటలకు అండర్-14, అండర్-17 బాలుర విభాగంలో పోటీలు జరుగుతాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీలను నిర్వహిస్తారు. పోటీల్లో ప్రతిభ చూపి ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారు. ఆటల పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. పీడీలు రాజేంద్రప్రసాద్, లక్ష్మి, వనజ, రవీంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- **ముసునూరు:** జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపికలు, టోర్నమెంట్ ఈనెల 13, 14 తేదీల్లో జరుగుతాయని ముసునూరు హైస్కూల్ హెచ్.ఎం సునీల తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలు, ఎంపికల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు తమ హెచ్ఎంల ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. ఎంపికైన బాలబాలికలను నూజివీడులో జరుగనున్న డివిజన్ స్థాయి పోటీలకు పంపుతామని చెప్పారు. పూర్తి వివరాలకు పీడీ ఆలీ ఖాన్‌ను సంప్రదించాలన్నారు.

నకిలీ కానిస్టేబుల్ అరెస్ట్

రోలుపడి(తిరువూరు): ఎక్సైజ్ కానిస్టేబుల్‌నని చెబుతూ ప్రజలను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్న బండి రామకృష్ణ అనే వ్యక్తిని తిరువూరు పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. వత్సవాయికి చెందిన బండి రామకృష్ణ కొన్ని రోజులుగా రోలుపడిలో నివసిస్తూ ఎక్సైజ్ పోలీసునని చెప్పుకుంటూ పలువురి వద్ద డబ్బులు వసూలు చేస్తున్నాడని ఫిర్యాదులు అందాయి. నిందితుడిని అరెస్టు చేసి తిరువూరు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించారు.

లింగాల- ఎరుకోపాడు రహదారి గండిని పూడ్చండి

గ్రామస్తుల వినతి

లింగాల(గంపలగూడెం): భారీ వర్షాలు, వరదలకు లింగాల- ఎరుకోపాడు రహదారికి గండి పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. లింగాల, సొబ్బాల ప్రజలు తిరువూరు వెళ్లాలంటే చుట్టూ తిరిగి గంపలగూడెం, గుళ్లపూడి గ్రామాల మీదుగా ప్రయాణించాల్సి వస్తోంది. గండి కారణంగా రహదారి వెంట పంట పొలాలకు రైతులు ఎరువులు వాహనాలతో తీసుకువెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. అధికారులు స్పందించి గండి పూడ్చివేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.